క్లుప్తంగా

నేడు మార్టూరులో పర్యటించనున్న ఆమంచి

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొననున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ప్లాంట్, 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని వారు కోరారు.

రేపు వల్లాపల్లిలో జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్‌అహమ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత క్యాంపులో చూయించుకున్న రోగులు కేస్ షీట్‌లతో శిబిరానికి హాజరు కావాలన్నారు. కొత్త రోగులకు పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేస్తామని వివరించారు.

చింతగుంపలలో నేత్రదానం

చినగంజాం: మండలంలోని చింతగుంపల గ్రామానికి చెందిన కరణం కాంచనమాల (84) ఆదివారం మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు వెంకన్న, సుబ్బారావు, నాగభూషణంలు దానం చేస్తున్నట్లు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీకి సమాచారమందించారు. గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావు, క్లబ్ అధ్యక్ష, కోశాధికారి కరి కమలేశ్వరరావు, చుండి సాంబశివరావు, రోటరీ సభ్యులు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.


కాంచనమాల (ఫైల్)

నేడు వలంటీర్లతో సమావేశం

బల్లికురవ: బల్లికురవలో సోమవారం ఉదయం 11 గంటలకు వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి పీ. బ్రహ్మరెడ్డి ఆదివారం రాత్రి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పాల్గొంటారని 20 సచివాలయాల్లో పని చేస్తున్న వలంటీర్లంతా సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు

చేతిరాతలో విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయిని

యదనపూడి: జాతీయ చేతిరాత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు బహుమతులు సాధించారు. ఆదివారం గుంటూరులోని మాజేటీ గురవయ్య డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈపోటీల్లో యద్దనపూడి మండలం సూరవరంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. సూపర్ సబ్ జూనియర్ విభాగంలో మొదటి బహుమతి బొల్లాపల్లి చరణ్‌తేజ్, సబ్ జూనియర్ విభాగంలో రెండో బహుమతి వీ. కీర్తి సాధించింది. ఉపాధ్యాయురాలు ఎంవీఆర్ఎల్పీ శారద వీరికి శిక్షణ ఇచ్చింది. ఈసందర్భంగా ఎంఈవోలు పీ సుబ్రహ్మణ్యం, చిలుకూరు గోపి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వేటపాలెం: ఉమ్మడి ప్రకాశం 50వ జిల్లా మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీల్లో వేటపాలేనికి చెందిన మాజీ ఎంపీటీసీ గాత్రం ఉమామహేశ్వరరావు ప్రతిభ కనబరచి విజేతగా నిలిచారు. ఆదివారం ఒంగోలులో లార్డ్ బ్యాడ్మింటన్ అకాడమీ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతగా నిలిచిన ఉమామహేశ్వరరావు 40 ఏళ్ల విభాగంలో ఫిబ్రవరి 17, 18 తేదీల్లో రాజమండ్రిలో జరగబోవు సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరితో 50 ఏళ్ల విభాగంలో హరిపురుషోత్తం, రహీం ఎంపికయ్యారు. వీరిని వేటపాలెం అసోసియేషన్ క్రీడాకారులు అభినందించారు.

అభివృద్ధికి చిహ్నాలు


వేమవరంలో ప్రారంభించిన గ్రామ సచివాలయం


గుంటుపల్లిలో గ్రామ సచివాలయం



ఉప్పుమాగులూరు-2లో ప్రారంభించిన సచివాలయం

- ప్రారంభానికి ముస్తాబైన ప్రాధాన్యత భవనాలు
- ఒక్కో సచివాలయానికి రూ. 86 లక్షల కేటాయింపు
- గ్రామాల్లోనే పాలనతో సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బల్లికురవ: గత ప్రభుత్వంలో ఒకప్పుడు ఏ చిన్న పనికోసం ఎక్కడకు వెళ్లాలన్నా మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో తరలి వెళ్లాల్సి వచ్చేది. ఎప్పుడు పని అవుతుందో తెలీదు.. అధికారులు ఎప్పుడొస్తారో తెలియక నానా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సొంతూరిలోనే పక్కా ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేసి సచివాలయాలను నిర్మించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లకు భవనాలు కట్టించి పాలన చేరువ చేశారు. ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు పౌరసేవలు, ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రతి సచివాలయానికి ప్రాధాన్యత భవనాలకు రూ.86 లక్షల నిధులు కేటాయించింది. మండలంలోని 20 సచివాలయాల్లో సచివాలయ, రైతు భరోసా వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లకు కలిపి రూ. 17.2 కోట్లు మంజూరు చేశారు. వీటిల్లో అన్ని శాఖలకు కలిపి 22 భవనాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని సచివాలయాల్లో ప్రారంభాలతో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.

ప్రారంభించిన భవనాలు..

వేమవరం గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ మూడు నిర్మాణ పనుల పూర్తితో ప్రారంభించటంతో వినియోగిస్తున్నారు. కొప్పరపాలెంలో రైతు భరోసా, సచివాలయం, మల్లాయపాలెంలో రైతు భరోసా, ఉప్పుమాగులూరు–1,2లో సచివాలయాలు, ప్రారంభంతో ప్రజలకు వివిధ శాఖల ఉద్యోగులకు అసౌకర్యాల నుంచి విముక్తితో సేవలు పొందుతున్నారు.


గుంటుపల్లిలో ప్రారంభానికి ముస్తాబైన రైతు భరోసా కేంద్రం

సేవలు బాగున్నాయి..



వేమవరం గ్రామంలో నిర్మించిన సచివాలయం రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నుంచి సేవలు బాగా అందుతున్నాయి. గతంలో ఏ పనికావాలన్నా 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. వైద్య సేవలకు 13 కిలో మీటర్ల దూరంలో ఉన్న గుంటుపల్లి వెళ్లాల్సిందే. నేడు ఆ పరిస్థితి లేదు.. గ్రామంలోనే అన్ని రకాల సేవలతో సౌక్యవంతమైన పాలన అందుతోంది.

– వేగినాటి ముత్యాలరావు, వేమవరం

ప్రాధాన్యత భవనాలు పూర్తి చేస్తాం..

ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు మంజూరు చేసిన ప్రాధాన్యతా భవనాలను పూర్తిచేసి వినియోగంలోకి తెస్తాం. నూతన భవనాల వినియోగంతో ప్రజలకు వివిధ శాఖల ఉద్యోగులకు అసౌర్యాల నుంచి విముక్తి కలుగుతుంది. దీంతో సుపరిపాలన అందించవచ్చు.

– ఎల్ బ్రహ్మయ్య, ఎంపీడీవో

ప్రారంభానికి సిద్ధమవుతున్న భవనాలు..

ఉప్పుమాగులూరు–1, చెన్నుపల్లి, గుంటుపల్లి, వల్లాపల్లి వైదన, వెలమవారిపాలెం, అంబడిపూడిలో రైతు భరోసా కేంద్రాలు వల్లాపల్లిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, చెన్నుపల్లి, గుంటుపల్లి, మల్లాయపాలెం, వల్లాపల్లి వైదన, వెలమవారిపాలెం, కూకట్లపల్లి, కొణిదెన, అంబడిపూడిలో పంచాయతీరాజ్ ఏఈ జీ. హనుమంతరావు పర్యవేక్షణలో పనులు తుదిదశకు చేరాయి. ప్రారంభానికి సన్నాహకాలు చేస్తున్నారు.

ఎన్నికలకు వైఎస్సార్ సీపీ సిద్ధం


సమస్యలు తెలుసుకుంటున్న హనిమిరెడ్డి


బల్లికురవలో పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న హనిమిరెడ్డి

- పార్టీ జెండా ఆవిష్కరించిన సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి

బల్లికురవ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అర్జునుడి వలె ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని అద్దంకి నియోజవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి బల్లికురవ ఎస్సీ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరణతో ఇంటింటా తిరిగి కాలనీ వాసులతో మాట్లాడారు. తాను ఈ ప్రాంతానికి కొత్త అయిన జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో తనను 50 రోజులుగా ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని ఇదే ఆదరణతో తనను ఎమ్మెల్యేగా, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. గ్రామాల వారీగా ప్రజలు ఇస్తున్న ఆదరణ చూస్తుంటే రెండో సారి జగన్ ముఖ్యమంత్రి కావటం 175 సీట్లు సాధించటం ఖాయమేనన్నారు. అంతకు ముందు ఎస్సీ కాలనీలోని చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, బల్లికురవ మాజీ జెడ్పీటీసీ జే. మాతయ్య, స్థానిక నేతలు కట్టా సుధాకర్, ఈర్తినేని పెద్దన్న, ఎల్బూరి రవీంద్ర, పావులూరి చందు, వంతా చిన హోహన్ కందుల ఏలీషా, ప్రత్తిపాటి కిరణ్‌కుమార్, కందుకూరి పేతురు, కందుల యాకోబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలి



మాట్లాడుతున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

- సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన సంక్షేమ పథకాలు ప్రచారం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రెండు చోట్ల నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ పాలకులు అందించిన పథకాలు వివరాలు తెలిసేతా జేజేపీ ప్రభుత్వం ఈ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని తలపెట్టిందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేశె పద్మేశ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణ మూర్తి, బీవీకే రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రార్థనలు

మార్టూరు: ముస్లింల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆదివారం మండలంలోని మార్టూరు గ్రామంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మార్టూరు గ్రామంలో జగనన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ముస్లింలకు చేసిన సంక్షేమ పథకాలు గురించి మసీదుల వద్ద మౌజన్‌లకు, మత పెద్దలకు వివరించారు. మసీదుల ముత్తవల్లిలు మీరావలి, ఎంపీటీసీ కరిముల్లా, ఇమామ్ హుస్సేన్, అల్తాఫ్ హుస్సేన్, సీఎం ముఖ్యమంత్రి కావాలని మసీదులో ప్రార్థనలు నిర్వహించిన వారిలో ఉన్నారు.


ముస్లింలకు చేసిన పథకాల గురించి వివరిస్తున్న మస్తాన్‌వలి

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, పుష్యమాసం, పుబ్బ నక్షత్రం, చవితి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


హాజరైన అధికసంఖ్యలో హృద్రోగులు


రోగులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెగా వైద్య శిబిరానికి బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన 927 మంది హృద్రోగులకు ప్రముఖ వైద్యులు రాజరాజేశ్వరి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ లలితప్రకాష్, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ సుధాకర్ యాదవ్, డాక్టర్ సూర్యప్రకాష్‌లు వైద్య పరీక్షలు చేశారు. ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ ఆధ్వర్యంలో బాధితులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేసి అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ షుగరు రోగులు ఆహార నియమాలు పాటించడంతో పాటు వ్యాయామాలు చేయాలన్నారు. పేదలకు ట్రస్ట్ అందిస్తున్న సేవా, ఆధ్యాత్మిక, మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆశ్రమం మేనేజర్ సురేష్ సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణారావు, కామేశ్వరరావు, శంకరరావు, శ్రీను, ఫణి కిషోర్ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కారంచేటి వంశీయుల సమ్మేళనం


హాజరైన కారంచేటి వంశీయులు

పర్చూరు (చినగంజాం): కారంచేటి వంశీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపలో వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పార్వతి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అద్దంకి నాంచారమ్మ దేవస్థానంలో శాంతి కళ్యాణం నిర్వహించారు. కారంచేటి శ్యాం సుందర ప్రసాద్ ఆధ్వర్యంలో కారంచేటి వంశ వృక్షం, వంశీయుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఆదిశైవ సంఘ రాష్ట్ర అధ్యక్షులు యనమండ్ర సత్యసీతారామశర్మ అర్చకుల సమస్యలు, సందేహాల గురించి వివరించారు. సమావేశానికి హాజరైన పెద్దలు, ముఖ్యులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో కారంచేటి వంశీయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆదిశైవ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ, ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్ కుమార్, రాష్ట్ర కోశాధికారి మురికిపూడి కృష్ణకిషోర్, సుబ్బారావు, కుమార్, శివరామకృష్ణ, శ్రీనివాసులు, మల్లికార్జునశర్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిశైవ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సత్యసీతారామశర్మ

ప్రతిభను వెలికితీయడానికే పోటీలు


పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వేటపాలెం: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికే ప్రతిభా పోటీలు ఉపయోగపడతాయని బండ్ల బాపయ్య హిందూ కాలేజీ సెక్రటరీ లేళ్ల కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో బాపయ్య ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ ప్రతిభా పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల్లో పదో రగతి చదువుతున్న 255 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభా పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 5,116, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 3,116, త్రితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 2,116, మరో ఏడుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి ఒక్కొక్కరికి రూ. 1000గా అందించనున్నట్లు తెలిపారు.